క్లుప్తంగా

పిన్నాపురంలో మొబైల్ ఆధార్ కేంద్రం



పిన్నాపురంలో ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో మంగళవారం మొబైల్ ఆధార్ కేంద్రంను నిర్వహించారు. దీంతో పలువురు ఆధార్‌కార్డులో మార్పులు, కొత్త ఆధార్ నమోదు చేయించుకున్నారని గ్రామ కార్యదర్శి నాగేంద్ర నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట క్రిష్టయ్య, మొబైల్ ఆధార్ సెంటర్ సిబ్బంది అనసూయ, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సల్కాపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కల్లూరు: పరీక్షలు సమీపిస్తుండటంతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రంగారెడ్డి పదోతరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం రాత్రి పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సంబంధించి సల్కాపురం విద్యార్థుల ఇళ్లకు ఆయన వెళ్లారు. నైట్ విజన్‌లో భాగంగా గ్రామంలో మనీషా, ఇందూ, అంజలీ, మేఘన, లక్ష్మీబాయి ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. పరీక్షలంటే భయం విడి ప్రశాంతంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలన్నారు. డీఈఓ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవీలత, అరుణ, సునీత ఉన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన రెండు కార్లు, ఒక ద్విచక్రవాహనం, అశోక్ లే లాండ్ ట్రక్కు వాహనాలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సీఐ శ్యాంప్రసాద్ మంగళవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మొత్తం 18 మంది పాటదారులు పాల్గొని 4వాహనాలను రూ.5,45,000లకు పాట పాడి దక్కించుకున్నారు. వాహనాల వేలం ద్వారా మొత్తం జీఎస్టీతో కలుపుకుని రూ.6,43,100ల ఆదాయం వచ్చినట్లు సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సి.బెళగల్: గ్రామాలలోని ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను క్లాప్ మిత్రల ద్వారా ప్రతిరోజు జరిగేలా చూసుకోవాలని ఈఓఆర్డీ సూచించారు.

2న ఎద్దుల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఈ నెల 2వ తేదీన అంతర్‌రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యులు తెలిపారు. గ్రామంలోని అంబాసహిత, యాగంటీశ్వరస్వామి తిరుణాల సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతులు అందిస్తామన్నారు. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల చొప్పున ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 9701338439, 9000729658 సెల్ నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

కొలిచిన వారికి కొంగు బంగారం

- నేటి నుంచి శ్రీచెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ఎనిమిది రోజులపాటు వేడుకలు
- జిల్లా నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున రానున్న భక్తులు



పోలకల్‌లోని స్వామివారి ఆలయం (ఇన్‌సెట్) అలంకరణలో శ్రీచెన్నసోమేశ్వర స్వామి (ఫైల్)

సి.బెళగల్: సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీచెన్నసోమేశ్వర స్వామి కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్నా రు. గ్రామంలో పార్వతిదేవి, గంగాదేవి, చాముండేశ్వరి దేవీల సమేతంగా కొలువైన స్వామివారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 8 రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 1, 2, 3వ తేదీలలో పుష్ప రథోత్సవాలను నిర్వహిస్తారు. 4, 5వ తేదీలలో ప్రభోత్సవం, తోలు బొమ్మలాట, 5వ తేదీ రాత్రి చలువ కాగులను యాదవులు ఊరేగింపుగా ఆలయంకు చేరుస్తారు. 6వ తేదీ రాత్రి మహా రథోత్సవం, 7న పారువేట, తోలు బొమ్మలాట, 8న వసంతోత్సవం, పెద్ద బావిలో స్వామివారి ఉత్సవ మూర్తుల చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా ఉత్సవాల్లో భాగంగా 6, 7, 8వ తేదీల్లో ఆలయ ధర్మ కర్తల, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

ఆలయ చరిత్ర:

శ్రీ కృష్ణదేవరాయలు పాలన కాలంలో తుంగభద్ర నది తీరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలకల్ గ్రామంకు పశువుల కాపర్లు వచ్చేసరికి రాత్రి అయింది. దీంతో తమ పశువుల మందను గ్రామంలో నిలిపివేసుకున్నారు. ఆ రాత్రి వాటికి మేతవేసిన గాడిపాడులో శిల స్వయంభుగా, గంభీర శబ్దంతో ఉద్భవించడంతో కాపర్లు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సమయంలో సోమేశ్వర స్వామి దర్శనం ఇచ్చి కాపర్లకు పూజలు నిర్వహించాలని చెప్పారని నానుడి. అప్పటి నుంచి నేటి వరకు స్వామి వార్లు పూజలు అందుకుంటున్నారని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

సంతాన ప్రాప్తికి ప్రత్యేకం:

స్వామి వారి రథోత్సవం ముందురోజు గొల్లలు నిష్ఠతో తుంగభద్ర జలాలను మట్టి కడవలలో తీసుకొస్తారు. ఆ సమయంలో ఎదురుగా వచ్చే గొర్రెల నుంచి రెండు పాలధారలను నది నీటిలోకి పితుకుని తీసుకొచ్చి ఆలయంలో ఉంచుతారు. రథోత్సవం అనంతరం కడవలలో పాలు పెరుగుగా మారుతుంది. దానిని ప్రసాదంగా స్వీకరించిన వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రసాదం స్వీకరించడం ఇక్కడ విశేషం.

ఎద్దుల బండలాగుడు, పొట్టేళ్ల పోటీలు..

స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 7న రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దులు బండలాగుడు పోటీలు, పొట్టేళ్ల పొట్లాట పోటీలు నిర్వహించనున్నారు. 8వ తేదీ క్యాటగిరి సైజు ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగనున్నాయి. గెలుపొందిన ఎద్దుల, పొట్టేళ్ల యజమానులకు భారీ ఎత్తున ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెద్ద సంఖ్యలో పోలీస్ బందోబస్త్



చెన్నసోమేశ్వరస్వామి ఉత్సవాలకు వచ్చే భక్తులు వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఇందుకోసం ఇప్పటికే నిర్వాహకులకు సూచనలు చేశాం . ప్రత్యేక కార్యచరణతో స్వామి దర్శనం, దుకాణాల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం. పెద్ద సంఖ్యలో పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేస్తాం.

– ఏసీ పీరయ్య, సి.బెళగల్ ఎస్‌ఐ

వందల ఏళ్ల నుంచి ఉత్సవాలు



మా తాతలకాలం నుంచి స్వామి వారి ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. స్వామి వారి మహిమను తెలుసుకున్న భక్తులు ఏటా పెద్ద ఎత్తున ఉత్సవాలకు వస్తున్నారు. వీరందరికి మూడు రోజుల పాటు వసతితో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

– పద్మనాభరెడ్డి, ఆలయ ధర్మకర్త

స్వామి మహిమ వల్లనే భక్తుల రాక



గ్రామంలో స్వయంభుగా వెలసిన స్వామివారు మహిమగల దేవునిగా గుర్తింపు పొందారు. దీని వల్ల ప్రతి సంవత్సరం జిల్లా నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు వస్తుంటారు. స్వామి వారి కృపతో కోరికలు తీరిన భక్తాదులు మొక్కులు తీర్చుకుంటారు.

– బీచు పల్లయ్య, ఆలయ పూజారి

ముమ్మరంగా భూముల రీసర్వే

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో ముమ్మరంగా భూముల రీసర్వే కొనసాగుతోంది. జగనన్న భూహక్కు- భూ రక్ష పథకంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం నాటికి 70512.12 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందని చెప్పారు.

నేడు పింఛన్ల పంపిణీ

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా బుధవారం మండలంలోని 8879 మంది లబ్ధిదారులకు రూ.2,46,46,500లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పింఛన్ల పంపిణీని వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పకడ్బందీగా అందజేసి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు.

యాగంటీశ్వరునికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్ కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత, యాగంటీశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాముల వారి తిరుణాల సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు ఉరుకుందస్వామి వారికి పంచామృతాభిషేకార్చనలు, దూపదీపనైవేద్యాలు సమర్పించారు. అనంతరం పాలకొలను గ్రామ వాస్తవ్యులు శివారెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు నాగభూషణం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు సీతా రామాంజనేయ బృందం వారిచే చెక్కభజన కార్యక్రమం చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున స్వామివారికి నంది వాహన సేవ, ప్రభోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, ట్రస్టుబోర్డు చైర్మన్ మద్దయ్య, కమిటీ సభ్యులు రాముగౌడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను శాసన మండలి స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో కలిసి మండలి ఎన్నికల్లో తన గెలుపు కోసం పూర్తి సహకారం అందించాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారని, ఈ నేపథ్యంలో కర్నూలు మండలి టికెట్‌ను బీసీకి ఇవ్వడం అభినందనీయమని ఎంపీ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు ఇవ్వాలి
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం స్థానిక స్టాంటన్‌పురంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పట్టభద్రుల స్థానానికి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎంవీ రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కర్నూలు మండల వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ గిరిజోన్, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ విజయకుమార్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేలు, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు శేఖర్, కరీముల్లా, రామకృష్ణారెడ్డి, ఖాజాబీ, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణ ఇష్టితో సకల శుభాలు



అఖండ హరినామ సంకీర్తన చేస్తున్న భజన బృందం భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీమన్నారాయణ ఇష్టి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సముద్రాల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమన్నారాయణ ఇష్టితో సకల శుభాలు కలుగుతాయన్నారు. వివిధ ధార్మిక సంస్థల సభ్యులు, భజన మండళ్లు అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. రేణుశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. బుధవారం దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు.



కోడుమూరు మోడల్ స్కూల్లో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈఓ



గడివేముల పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాంస్కృతిక ప్రదర్శనలతో మానసిక వికాసం

కర్నూలు కల్చరల్: కర్నూలు బాలోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. స్థానిక ఇండస్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు పలు అంశాల్లో ప్రదర్శన ఇచ్చారు. ముగింపు వేడుకలకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకరశర్మ, ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల నుంచి బాలోత్సవంలో పాల్గొన్న అందరూ విజేతలే అన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందన్నారు. కన్వీనర్ ఎం.పి. బసవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్ర పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య, ఇండస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్, బాలోత్సవం కార్యదర్శి జీఎస్ శేషయ్య, సమత కన్వీనర్ రమాదేవి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలి

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం సచివాలయ సిబ్బంది పనిచేయా లని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయ న నగరంలోని కొత్తపేటలో ఉన్న సచివాలయా న్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకా లంలో వేయించాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో ఉన్న మాతాశిశు సంరక్షణ (ఎంసీపీ)కార్డులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, మాస్ మీడియా సిబ్బంది ఖలీల్ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ముద్దాయిల అరెస్ట్

కల్లూరు: పుసులూరు గ్రామంలో ఓ బాలిక కిడ్నాప్ కేసుకు సంబంధించిన ఇద్దరు ముద్దాయిలు పి.రమేష్, పి.నాగేంద్రలను ఉలిందకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం చిన్నటేకూరు బస్‌స్టాప్‌లో వీరిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. మరో ముద్దాయి పి.చల్లమయ్య కోసం సిబ్బందితో కలసి గాలిస్తున్నట్లు చెప్పారు.

సైన్స్‌తో విద్యార్థులకు బంగారు భవిష్యత్



గురుకుల పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాను పరిశీలిస్తున్న మేయర్ రామయ్య

కోడుమూరు రూరల్/కల్లూరు/గడివేముల/పాణ్యం: సైన్స్‌తో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని, సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కోడుమూరు మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో సైన్స్ ప్రదర్శనకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన వివిధ సైన్స్ నమూనాలను పరిశీలించి ప్రశంసించారు. నోబెల్ బహుమతి గ్రహీత సీవీ.రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా కోడుమూరు పట్టణంలోని నాగార్జున విద్యానిలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల డైరెక్టర్లు నాగార్జున, ఎద్దుల సూర్యరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కల్లూరులో..

కల్లూరు అర్బన్ 21వ వార్డులోని గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ సీవీ రామన్ సైన్స్‌లో చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూమానవాళి అభివృద్ధి సైన్స్ తోనే సాధ్యమన్నారు.

గడివేములలో..

గడివేముల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గడిగరేవుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన సైన్ ప్రాజెక్ట్ న మూనాలు ఆకట్టుకున్నాయి. గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరీ పాఠశాలలో విద్యార్థులు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ రామేశ్వరరావు బహుమతులు అందించారు.

పాణ్యంలో

పాణ్యం మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న కాలనుగుణంగా సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ శేషయ్య హరిత, వెంకటేశ్వర్లు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.





బురాన్‌దొడ్డిలో గోకారమయ్య దర్గా, పలుకుదొడ్డిలో విద్యుద్దీపాలంకరణలో బడేఖాన్ ఖాద్రీ దర్గా

ఉత్సవాలకు వేళాయె

- నేటి నుంచి బురాన్‌దొడ్డి,పలుకుదొడ్డిలో ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో బుధవారం నుంచి శ్రీ గోకారమయ్య ఉరుసు ఉత్సావాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు గంధం, గురువారం ఉరుసు, శుక్రవారం కిస్తీ కార్యక్రమాలు నిర్వహించనునట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా పలుకుదొడ్డి గ్రామంలో శ్రీ బడేఖాన్ ఖాద్రీ (బడేసాహెబ్) ఉరుసు ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో దర్గాను విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు.

క్రిష్ణదొడ్డిలో దేవరా:

మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో బుధవారం గ్రామ దేవత పెద్దమ్మ దేవరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దేవరాలో భాగంగా నిర్వాహకులు ఆలయంను సుందరంగా ముస్తాబు చేశారు.



అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

సి.బెళగల్‌లో విగ్రహాల ప్రతిష్ఠ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ శివారులో చెరువులో వెలసి శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా గ్రామంలో ముందుగా విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. సాయంకాలం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

వర్షపునీటిని ఒడిసి పట్టాలి

సి.బెళగల్: వర్షపునీరు వృథా కాకుండా ప్రతి బొట్టు భూమిలో ఇంకిపోయేలా ఒడిసి పట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగు నీరు – వ్యవసాయ పరివర్తన పథకం అమలులో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని, వర్షపునీరు వృథాగా పోకుండా భూమిలో ఇంకిపోయేలా చూడాలన్నారు. రైతులు తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగుచేసుకోవాన్నారు. సూక్ష్మబిందు సేద్యం, పొదుపుగా నీటి వనరుల వినియోగంపై ఏడీఏ వెంకటేశ్వర్లు, సాంకేతిక వ్యవసాయ అధికారి అల్లిపీర, ఏఓ మల్లేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఖాదర్‌వలి, సిబ్బంది, రైతులు ఉన్నారు.



రైతులకు నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు